


# లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్

సునీల్ గూరి

నేను నా గతం నుంచి కొంత నేర్చుకున్నాను. ఇంకొంత ఎలా నేర్చుకోవాల్నో తెలియక నేర్చుకోలేదు. ఇంకా మిగిలిన దాన్నుంచి ఎందుకు నేర్చుకోవాల్నో తర్కించి వదిలివేశాను.

***


సినీ పరిశ్రమలో దర్శకుడిని కావాలన్న నా అభిలాషకి బీజం ఎప్పుడు పడిందో నాకు తెలియదు కానీ నేను ఇంటర్ చదువుతున్నప్పుడు చూసిన కొన్ని సినిమాల వల్ల కలిగిందని చెప్పగలను. చూసే ప్రేక్షకుల్లో ఒకడిగా మిగిలిపోక చూపించే దార్శనికుడవ్వాలన్నది నా వాంఛ.



ముందుగా హైదరాబాదు వెళ్ళి అక్కడ ఎవరైనా ఓ సినీ దర్శకుడి దగ్గర సహాయకుడిగా చేరి మెళకువలు ఒంటబట్టించుకొని అటుపిమ్మట బాగా డబ్బున్న ఓ ఆసామిని (సినీ నిర్మాణంపై ఆసక్తి కలిగిన) నా దగ్గరున్న కథలతో ఒప్పించాలన్నది ఉపాయం. దాదాపు దర్శకుడు కావాలన్న ప్రతి ఒక్కరి ఆలోచనలూ ఇలానే వుంటాయని పరిశ్రమకు వెళ్ళిన తర్వాత గాని తెలియలేదు.

***

సినీ పరిశ్రమ అనేది ఓ కర్మాగారం కాదు. పరిశ్రమలోనికి వెళ్ళడానికి ముఖద్వారం అంటూ ఉండదు. కళామతల్లి కటాక్షం జాస్తిగా ఉంటే తప్ప ముఖద్వారం దానంతటదే తెరుచుకోదు. చాలామంది ఎంతో శ్రమించి



గానీ దాన్ని తెరవలేరు. అయితే ఇక్కడ ఏదో బ్రతికేద్దామని వచ్చే అర్హత లేనివారు, ఆ ముఖద్వారానికి పనిచెప్పకుండా దొడ్డిదారిన లోనికి చేరే సదుపాయం ఉంది. కాని పరిశ్రమలో కలకాలం నిలిచేది మాత్రం నిజంగా విద్వత్తున్న కళాకారులే అని నేను చేసుకున్న అవలోకన. అది నాకు ఉందన్నది నా విశ్వాసం.

***

మాకు దగ్గర బంధువయిన ఒకాయనకి తమ్ముడి వరస అవుతాడు బాలసుందరం. చూడ్డానికి గుండ్రంగా, పొట్టిగా చదువుకున్న పిల్లవాడిలా కనిపిస్తాడు కాని ఇంటర్లోనే చదువాపేసి వాళ్ళ నాన్నకున్న కిరాణ సరకుల దుకాణంలో ఉంటూ, తండ్రికి సాయం చేస్తున్నాడు. చదువు దాదాపు ఆపివేసినట్టే. బాలసుందరంతో పది సంవత్సరాల క్రితం చదివిన ఓ అబ్బాయి నేడు తెలుగు సినీ పరిశ్రమలో మంచి స్థానంలో ఉన్న సంగీత దర్శకుడు. గత రెండు సంవత్సరాలుగా పదమూడు సినిమాలు ఆయన పేరున విడుదల అయ్యాయి. అందులో నాలుగు సినీ పరిభాషలో సూపర్ డూపర్ హిట్లు కాగా రెండు సూపర్‌హిట్లు, రెండు ఎబౌ ఆవరేజ్, నాలుగు ఆవరేజ్‌లు, ఒకటి సదరు సంస్థ ఊహించిన స్థాయిలో నడవని చిత్రం. ఇందులో పై రెండు సూపర్ డూపర్ హిట్లలో ఈ సంగీత దర్శకుడి పాటలు ఉర్రూతలూగించాయన్నది వాస్తవం. నాకు మాత్రం అతని స్వరకల్పనలో ఓ రెండు పాటలు నోటికి వచ్చు. అవి నాకు ఇష్టం.

***

డిగ్రీ పూర్తయిన రెన్నెళ్ల తరువాత ఓ ఆదివారం హైదరాబాద్‌లో ఆ సంగీత దర్శకుడి ఇంటిముందు రెండు గంటలు పడిగాపులు గాచాక గానీ తెలియలేదు బాలసుందరం స్నేహంలోని గాఢత. చివరికి ఎలాగోలా వాచ్‌మాన్‌ని బతిమిలాడి ఆ మరుసటి రోజు పాటలు రికార్డింగ్ జరిగే స్టూడియో వివరాలు కనుక్కొని, తెల్లారి ఆ స్టూడియో ముందు ఓ మూడు గంటలు వేచాక చివరికి కలిశాడు. అతని వయసు బాలసుందరం వయస్సే. పెళ్ళీడుకి వచ్చిన వయసు. చూడ్డానికి పొట్టిగా లావుగా వున్నాడు. ఒత్తుగా పెంచిన జుత్తు సామాన్య జనాన్నుంచి అతని బాహ్య స్వరూపాన్ని వేరుచేసేలా వుంది.

బాలసుందరాన్ని చూడగానే గుర్తుపట్టాడు. బాలసుందరం నన్ను పరిచయం చేసి, నా అభిరుచి గురించి చెబితే అతని పర్సనల్ మేనేజరుకు కన్పించి వివరాలు ఇమ్మన్నాడు. టీలు తాగి బయలుదేరాం. అంత బిజీగా వుండి కూడా 'చూశావా' ఎంత మర్యాదగా మాట్లాడాడో అన్నది బాలసుందరం గర్వం.

కళాకారుడు సమాజంలోని కొన్ని విషయాలకు స్పందించి, ఆ స్పందనని తనకి నచ్చిన 'కళా' రూపంలో తిరిగి సమాజానికే చూపి, అదే సమాజంలో గొప్ప అనిపించుకుంటాడు కాబట్టి అతను సమాజానికి నిత్యం దాసుడే. అందుకే కళాకారుడికి మర్యాద ఉండటం నాకేం గొప్ప విషయంగా తోచదు. అతను సమాజాన్ని ప్రతిబింబించే ఓ సాధకుడు మాత్రమే. మర్యాద అనేది అతని రక్తంలో ప్రవహించాల్సిన ప్రాణవాయువు లాంటిది. ఆ ప్రాణవాయువు అతన్ని రక్షించేదే కానీ, పరుల్ని కాదు.

***

సినిమా ఆఫీసులు ఎక్కువగా వుండే సెంటర్‌లో తక్కువ అద్దెకి ఒక హాస్టల్‌లో అద్దెకు దిగాను. ఇంట్లో అమ్మానాన్నకి ఓ సంవత్సరం పాటు ఇక్కడ ప్రయత్నాలు సాగిస్తాననీ, ఇక్కడికి రావడం ససేమిరా ఇష్టంలేదని వాళ్ళని ఒప్పించాను. బెంగుళూరులో ఉద్యోగం చేసే అన్నయ్య కూడా నా కాలవ్యవధికి అనుమతించాడు.

అప్పట్నుంచి నా ప్రయత్నాలు మొదలయ్యాయి. నేను చొరవగా నాకు తెలిసిన అడ్రస్‌ల ఆధారంగా ఇద్దరు దర్శకులని కలిస్తే వారి దగ్గర కావల్సినంత సహాయక బృందం వుందని సున్నితంగా తిరస్కరించారు. రెండ్రోజులకొకసారి ఆ సంగీత దర్శకుడి మేనేజర్‌కి ఫోన్ చేస్తే 'తప్పకుండా' ఎక్కడనైనా కుదిర్చేలా చూస్తానన్నాడు. నాకు అతనికి ఫోన్ చేసినప్పుడల్లా నేను భవిష్యత్తులో తీసే సినిమాలు విడుదలై, సూపర్‌హిట్టై టిక్కెట్లు దొరకక వెనుదిరుగుతున్న ప్రేక్షకుల మొహాలు మదిలో మెదిలేవి. ఇలా ఓ నెల గడిచింది. ఓ ఆఫీసులో పరిచయమైన ప్రొడక్షన్ మేనేజర్ కోసం ఓ పెద్ద స్టూడియోకి వెళితే అక్కడ సినిమాల్లో వేషాలకోసం తిరుగుతున్న లక్ష్మణ్ తగిలాడు. బాగా చదువుకొని, మరీ వచ్చాడట ఇక్కడికి. వారాలపాటు ప్రతిరోజూ అదే స్టూడియోలో జరుగుతున్న ఆ షూటింగ్‌కి వస్తూ ఒకరికొకరు బాగా దగ్గరయ్యాం.

కళాకారుడు సమాజంలోని కొన్ని విషయాలకు స్పందించి, ఆ స్పందనని తనకి నచ్చిన 'కళా' రూపంలో తిరిగి సమాజానికే చూపి, అదే సమాజంలో గొప్ప అని పించుకుంటాడు కాబట్టి అతను సమాజానికి నిత్యం దాసుడే. అందుకే కళాకారుడికి మర్యాద ఉండటం నాకేం గొప్ప విషయంగా తోచదు. అతను సమాజాన్ని ప్రతిబింబించే ఓ సాధకుడు మాత్రమే. మర్యాద అనేది అతని రక్తంలో ప్రవహించాల్సిన ప్రాణవాయువు లాంటిది.

***

చలికాలం మంచి ఊపులో ఉండే సంవత్సరారంభంలో నేను, లక్ష్మణ్ కలిసి రూమ్ తీసుకున్నాం. పరిశ్రమకు వచ్చే వాళ్ళందరి జీవితాలు ఒకేలా ఉంటాయి. నాకు దర్శకుడిగా ఎదగాలని ఎంత కోరికుందో లక్ష్మణ్‌కి అతని అభినయంపై అంత నమ్మకం. అప్పుడప్పుడు రూమ్‌లో అతని స్నేహితులని తోడ్కొని వచ్చేవాడు. మద్యం సేవించి అతను చేసే అభినయం అద్భుతం. నెలరోజుల్లోనే నాకు తెలిసింది. ఓ వంద కాపీల ఫొటోలు పలు సినిమా ఆఫీసుల్లో ఇచ్చాడని, ఫొటో వెనకాల తన పేరు, మొబైల్ నెంబరు వుండేవి. నన్నూ ఓ మొబైల్ కొనమని బలవంతం చేస్తే అన్నయ్యతో పోరి ఓ వాడిన పీస్‌ని సేకరించాను. సదరు సంగీత దర్శకుడి మేనేజర్‌కి నెంబరు ఇస్తే.. తప్పకుండా నా నెంబరుకి కాల్‌చేసి అవకాశం ఉంటే చెప్తానేవాడు. ఆ సంగీత దర్శకుడిని ఒంటరిగా కలిసేందుకు మన సొప్పేది కాదు. ఆయనే ఈ మేనేజర్‌ని కల్పించాడు కదా నా అభిప్రాయం.

***


రూమ్‌కి దగ్గర్లోనే ఓ ప్రైవేటు లైబ్రరీలో 150 రూపాయలకి అభ్యర్థిత్వం తీసుకున్నాను. రోజూ సాయంత్రం ఓ గంట అందులో గడిపేవాడ్ని. ప్రతి రాత్రి ఓ గంట సినిమా స్క్రిప్టులు రాసి లక్ష్మణ్‌కి వినిపించేవాడ్ని. అతనికి నా కథలపై మంచి గురి. సంక్రాంతికి ఇంటికి వెళ్ళి రెండ్రోజుల్లో వచ్చాను. అమ్మానాన్న ఏం అడిగినా నా గడువు పూర్తవలేదని దాటేశాను. రూమ్‌కొచ్చేసరికి లక్ష్మణ్ ఓ పదిమందితో కల్సి పార్టీలో ఉన్నాడు. విషయం ఏంటని ఆరా తీస్తే ఏదో పెద్ద సినిమా ఆఫీస్ నుంచి కాల్ వచ్చిందన్నాడు. ఆ మర్నాటినుండే షూటింగ్ ప్రారంభం అట.

ఇరవై ఐదు రోజులకు పైగా వెళ్ళాడు షూటింగ్‌కి. రోజూ ఉదయం ఐదింటికి లేచి కంపెనీ బస్సులో లొకేషన్‌కి వెళ్లేవాడు. రెండు సీన్లు హీరోతో, ఒకటి హీరో గారి నాన్నతో అన్నాడు. నాలుగు క్లోజప్‌లో ఉన్నాయట. సంతోషపడ్డాడు. ప్రేక్షకులు, ముందు మనిషిని గుర్తిస్తే అవకాశాలు వాటంతటవే వస్తాయి. నిజానికి గత అయిదు నెలలుగా ఆ సినిమాలో నటించడానికి పైరవీలతో తిరిగేవాడు. ఆ సినిమా కాస్టింగ్‌డైరెక్టర్‌తో అంతకు ముందే పరిచయం వుండడంతో పని తేలికైంది. నేను కూడా ఓ మూడు రోజులు షూటింగ్‌కి వెళ్ళాను. కొన్ని విషయాలు తెలిసిన విషయాలు డైరీలో రాసుకునేవాణ్ణి. మనం చెప్పాలనుకున్న విషయాన్ని ప్రేక్షకులకి చెబితే ఏ పద్ధతిలో బాగుంటుందో నిర్దేశించేవాడే దర్శకుడు. వేరే సినిమా షూటింగ్‌లో చిత్రిస్తున్న పద్ధతిని చూసి నేనైతే ఎలా చూపిస్తానో ఊహిస్తూ నా ఊహాశక్తిని పెంచుకునే వాణ్ణి.

ఇలా ఏడు నెలలు గడిచాయి. ఎవర్ని కలిసినా అవకాశాలు లేవంటున్నాడు. పెద్ద దర్శకుల వద్ద బ్యాచీల వారీగా కావాల్సినంతమంది ఉన్నారు. నాకేమీ తోచేది కాదు. ఆ మేనేజర్‌ని కలిస్తే 'నేనే నీకు ఫోన్ చేసి చెబుతాను' అని దాటేసేవాడు. మరోసారి బాలసుందరాన్ని కదిపితే 'ఇంతకు మించి నేనేమి చేయలేను' అని కరాకండిగా చెప్పేశాడు. ఒక గొప్ప హోదాలో ఉన్న వ్యక్తి స్నేహాన్ని వాడుకోవడం తనకి ఇష్టంలేదు కాబోలు. అక్కడికి పరిచయమైనా చేయించాడు సంతోషం.

***

ఆ మరుసటి రోజు లక్ష్మణ్ నటించిన చిత్రం విడుదల. ఆ రాత్రి ఇద్దరికీ నిద్రలేదు. ''ఇంకో రెండు నెలల్లో కూడా అవకాశం రాకపోతే ఏం చేస్తావ్...?'' రూంలో లైటార్పేసి చాపపై వెన్ను వాలుస్తూ అడి




గాడు లక్ష్మణ్.

''మాస్ కమ్యూనికేషన్స్‌లో పిజి చేసి ఏదైనా యాడ్ ఏజెన్సీ లాంటి సృజనాత్మక రంగంలో ఉద్యోగం సంపాదించాలి'' అన్నాను.

''రేపు నా జీవితం తెలుస్తుంది. రెండేళ్ళుగా తిరుగుతున్నాను. పరిశ్రమ పూర్తిగా నటవారసులతో నిండిపోయింది. పన్నెండు సినిమాల్లో జూనియర్ ఆర్టిస్టుగా గుంపుల్లో కనిపించాను. కానీ నా కష్టం ఫలించి దాదాపు ఓ పది నిముషాల నిడివి గల పాత్ర దొరికింది. నన్ను తెరపై చూసి ఊర్లో అమ్మ ఎంతో సంతోషిస్తుందో చెప్పలేను. ఇక నా స్నేహితుల సంగతి సరేసరి'' అతను చెప్పడం ఎప్పుడాపాడో తెలియదు. నేను 'అతని' ఆనందాన్ని నా మెదడులోకి ప్రవహింపజేస్తుంటే హాయిగా అనిపిస్తూ మగతగా నిద్రపట్టేసింది. బహుశా అతని హృదయంలో ఆనంద తరంగాలు నన్ను నిద్రపుచ్చుతున్నాయి.

***

ఉదయం ఆట, పదకొండు గంటలకి. లక్ష్మణ్‌తో పాటు నేను, ఇంకా అతని ఏడుగురు స్నేహితులు హాల్‌కి వెళ్లాం. అందరికి ఒకటే ఉత్కంఠ. సినిమాలో లక్ష్మణ్ అభినయం ఎలా వుంటుందో అని. సినిమా మొదలయింది. కథ ఊహించిన తీరుగానే వున్నా దర్శకుడి ఫ్రేమింగ్ (దృశ్యంలోని పాత్రల్ని చూపించే విధానం) కొత్తగా ఉంది. దానికితోడు నేపథ్య సంగీతం నాకు బాగా నచ్చింది. ఇంటర్వెల్ వరకు కనిపించలేదు లక్ష్మణ్. సినిమా చివర్లో తన పాత్ర ప్రవేశం వుంటుందని ముందే చెప్పాడు.

సినిమా ఇంకో అరగంటలో అయిపోతుందనగా ఇప్పుడొస్తుందంటూ ఆత్రుతగా మా అందర్నీ కలవరపెట్టసాగాడు. సినిమా పూర్తికావచ్చింది. క్లైమాక్స్‌లో ఫైట్ లేదు. మంచి నాటకీయత వుంది.

సినిమా అయిపోయింది. లక్ష్మణ్ మాత్రం కనిపించలేదు. మా అందరి ముఖాలూ నీరసించిపోయాయి. లక్ష్మణ్ పరిస్థితి చెప్పాల్సిన పనిలేదు. చొరవగా ఒక స్నేహితుడు ఆ సినిమా కాస్టింగ్ డైరెక్టర్‌కి ఫోన్ చేస్తే 'ఎడిటింగ్‌లో సినిమా నిడివిని తగ్గించామని, కట్ చేసినా కథకి ఆటంకం కలిగించని దృశ్యాలని తొలగించాము' అని చెప్పాడు. 'అందులో లక్ష్మణ్ పాత్ర కూడా వుండడం అతని దురదృష్టం' అన్నాడు.

ఆరోజు, మరుసటిరోజు లక్ష్మణ్ రూమ్‌కి రాలేదు. ఫోన్ చేస్తే రెండ్రోజుల్లో వచ్చేస్తానని కట్ చేసేవాడు. నాకెంతో బాధేసింది. ఆ బాధలో మేనేజర్‌కి ఫోన్ చేస్తే 'నీ పని అయిపోయింది, ఉదయం తొమ్మిదింటికి రికార్డింగ్ స్టూడియోకి రాగలవా' అని స్టూడియో పేరు చెప్పాడు. నా బాధ కొంతలో కొంత తగ్గింది.

***

ఆ మరుసటిరోజు ఏడింటికి లేచి కాలకృత్యాలు తీర్చుకొని, గుడికి వెళ్ళి అక్కడ్నుంచి రికార్డింగ్ స్టూడియోకి వెళ్ళాను. ఆ సంగీత దర్శకుడు అప్పుడే తన కారు దిగి లోనికి వెళ్తున్నాడు. పలకరిస్తే 'నమస్కారం' అని గౌరవంగా నవ్వాడు. అతను లోనికెళ్ళగానే మేనేజరు స్టూడియోకి కొద్దిదూరంలో తీసుకెళ్ళి 'సిగరెట్ అలవాటుందా' అని సిగరెట్ తీసి అంటించాడు. లేదన్నాను. దాదాపు సంవత్సరం నుంచి ఈయనతో పరిచయం వుంది. ఇంత చొరవగా ఎప్పుడూ మాట్లాడలేదు. గాల్లో పొగ వదులుతూ చెప్పసాగాడు.

''నువ్వు నా చుట్టూ తిరగడం ఏమీ బాలేదు. సంవత్సరం నుంచి నిన్నంతలా తిప్పుతున్నందుకు నాక్కూడా బాధేస్తోంది. నేనో ఉపాయం చేశాను. ఈ పరిశ్రమలో నాకు ఇద్దరు నిర్మాతలు, ఇద్దరు దర్శకులు బాగా పరిచయం. వారు తీసిన గత చిత్రాలకు నువ్వు పనిచేశావని వాళ్ళు హామీ పత్రం ఇస్తే నీకు సహాయ దర్శకుడి గుర్తింపు కార్డు వస్తుంది. ఆ కార్డు సాయంతో నిన్ను నీకిష్టమైన వాళ్ళ దగ్గర చేర్పిస్తాను. ఏమంటావ్'' అని దమ్ము లాగాడు.

నాకు అతను చెప్పింది బానే అనిపించి 'సరే' అన్నాను.

''నువ్వొప్పుకున్నందుకు సంతోషం. ఇక్కడ మరో విషయం. ఇద్దరు దర్శకులు, ఇద్దరు నిర్మాతల్ని ఒప్పించడానికి ఓ ఇరవై వేల రూపాయల వరకు ఖర్చవుతుంది. అది నా ఖర్చు కాదు. వారికి నేనిచ్చేది. నువ్వొప్పుకుంటే ఓ వారంలో నీ పనవుతుంది''. ఆఖరు దమ్ము లాగి పీక దూరంగా విసిరేసి నా వంక చూశాడు. నాకు నిజంగా ఏం చెప్పాలో అర్థంకాలేదు. అప్పుడే పరిచయమైన ఒక మనిషి ఆ మాటంటే అతడు నాకోసం చేసిన ఏర్పాటుకు పొంగిపోయేవాడ్నేమో. కానీ ఓ సంవత్సరకాలంగా పరిచయమున్న ఓ వ్యక్తి అన్ని డబ్బులడిగాడంటే అసలక్కడ ఒక్కక్షణం కూడా ఉండాలనిపించలేదు.

'రేపటిలోగా ఏ విషయం చెబుతాను' అని బయలుదేరాను. మెదడు శూన్యంగా మారింది. దిక్కుతోచనట్టు రూమ్‌కి వచ్చి అనాలోచితంగా రెండు నిమిషాలు కూర్చున్నాను. అంతే... లేచి త్వరత్వరగా బట్టలు సర్దేసి అన్నీ ఓ సూట్‌కేసులో కుక్కేసి, మిగిలిన సామాన్లు పెద్ద బ్యాగ్‌లో వేసి ఆటో మాట్లాడి బస్టాండ్‌కి బయలుదేరాను. రూమ్‌లో లక్ష్మణ్ సామాన్లు ఏమీ లేవు. అతని తాళంచెవి కూడా ఇంటిగలాయనకి గంట ముందే ఇచ్చి వెళ్ళాడట.

బస్టాండ్ దగ్గర ఆటో దిగి లోనికి వెళ్తుండగా నా మొబైల్ మోగింది. లక్ష్మణ్. పలకరింపుగా కొద్దిసేపు మాట్లాడి ''నేను ఇంటికి వెళ్ళిపోదామనుకుంటున్నాను. నా ఆశలన్నీ అడుగంటాయి. నాకు ఏం చెయ్యాలో తోచట్లేదు. నువ్వు రేపు గొప్ప దర్శకుడివయితే నాకు నీ సినిమాలో మంచి వేషం ఇస్తావని ఆశిస్తున్నాను. ఉంటాను'' అని కట్ చేశాడు. నా హృదయం ద్రవించింది. ఎన్నో అవకాశాలు తెచ్చిపెడుతుందనుకున్న సినిమాలో తను కనిపించకపోవడం వల్ల అతను, ఎన్నో ఆశలు పెట్టుకుని చివరికి ఆత్మవిశ్వాసం కోల్పోయాడు.

ఏదో ఆవేశం అణువణువు కమ్మేసింది. అది ఎవరిపైనో తెలియదు. ఈ అలక వల్ల ఎవరికి నష్టమో నాకు తెలుసు. ఇలాంటి అనుభవాల వల్ల మనిషి ఏమి నేర్చుకుంటాడో అంతుపట్టట్లేదు. ఈ అనుభవం వల్ల మాత్రం నేనేమి నేర్చుకోలేదు. ఇలా సాగుతున్న నా ఆలోచనలతో బస్టాండ్‌లో నడుస్తుండగా నా ఎదురుగా వున్న కుర్చీలో నన్నే గమనిస్తూ పెదవులను నవ్వుకై ఆహ్వానిస్తూ లక్ష్మణ్. నేనో క్షణం ఖంగుతిని వెంటనే తేరుకుని అతన్ని చూస్తూ భుజాన సంచీ, చేతిలో సూట్‌కేసు కిందికి దించి దూరంనుంచే నవ్వడం మొదలుపెట్టాను. ఇద్దరం ఒకరినొకరం అలా చూస్తూ మనస్ఫూర్తిగా చాలాసేపటివరకు నవ్వుకున్నాము.

మా హృదయంలో ఏవో ఆనంద తరంగాలు ఒకరినుంచి మరొకరికి చేరుతూ మమ్మల్ని సంతోషపెడుతున్నాయి. మా గతం నుంచి మేమేం నేర్చుకున్నామో నిజంగా మాకు తెలియదు. మరి ఈ నవ్వుకి కేంద్రం ఏంటి అంటే మా వద్ద జవాబు లేదు.